# గిరిజనాభివృద్ధి కృషిలో సమన్వయ లోపం

[ఆంధ్రప్రభ ప్రతినిధి]

కాకినాడ, ఆగస్టు 28: తూర్పు గోదావరి జిల్లా గిరిజన ప్రాంతాలలోని కీలకమైన అధికారుల స్థానాలన్ని గత ఏప్రిల్ నుంచి ఖాళీగా ఉన్నాయి. సబ్ కలెక్టర్ బాధ్యతలను చేపట్టిన ఆర్‌డిఓ కూడా జూలైలో బదలీ అయినారు. సంచార మెజస్ట్రేట్ ఈ బాధ్యతలను అదనపు ఇన్‌చార్జిగా చేపట్టారు. న్యాయాధికారిగా, ఆర్‌డిఓగా ఉన్న అధికార బాధ్యతలకు తోడు ఈ అదనపు నిధుల వల్ల ఆయనపై పని భారం పెరిగినవి.

ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయినా ఐఎఫ్ఎడి [వ్యవసాయాభివృద్ధి అంతర్జాతీయ నిధి] అనే నూతన కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిష్టాత్మకమైన ఈ అంతర్జాతీయ కార్యక్రమం కింద అందుబాటులోకి వచ్చే నూతన పద్ధతులను వివరిస్తూ గిరిజన సంక్షేమ శాఖ చిన్న కరపత్రమైనా ఈనాటి వరకూ వెలువరించలేదు. కార్యక్రమం అమలు జరగడం, దాని ద్వారా లభించే పరిజ్ఞానం అట్టడుగు స్థాయిలోని వారికి అందుబాటులోకి రావడం వంటి విషయాలతో మెరుపులా వచ్చిపోతుండే అంతర్జాతీయ నిపుణులకు, సలహాదారులకు ప్రమేయం లేదు. వారికి తమ పెట్టుబడులను తిరిగి ఎలా రాబట్టుకోవాలో బాగా తెలుసు. తృతీయ ప్రపంచ దేశాలలో పెట్టుబడి వల్ల సంపన్న దేశాలకు వ్యాపారం, వారి నిపుణులకు ఉద్యోగాలు సమకూడుతున్నాయి.

అధికార పదవులు ఖాళీగా ఉన్నా ఐఎఫ్ఎడి కార్యక్రమాలకై మొత్తం 7 సంవత్సరాల కాలానికి ఉద్దేశించిన నిధులలో మూడవ వంతు మేరకు మొదటి సంవత్సర కాలంలోనే విడుదలైనవి. లోగడ పోడు వ్యవసాయం సాగి, పునరావాస కార్యక్రమాల క్రిందకు వచ్చిన మారేడుమిల్లి మండలంలో పండిరిమామిడికోట, వేటుకూరు వంటి గ్రామాలకు కూడా ఈ నూతన కార్యక్రమాలు వర్తింప చేశారు. ఈ రెండు గ్రామాలలో పట్టు పరిశ్రమను పెంపొందించడానికి దశాబ్ద కాలంగా జరిగిన యత్నాలు ఫలించలేదు. తదుపరి ఆ గ్రామాలలో టస్సార్‌సిల్క్, రబ్బర్ తోటలను ప్రభుత్వం చేపట్టినది. 34 కుటుంబాలకు చెందిన సుమారు వంద ఎకరాలలో వేసిన సిట్రాన్‌గడ్డిని సంవత్సరంగా కోయలేదు. సిట్రాన్‌ల్లా నూనె తీసే యంత్రం మరమ్మతులో ఉన్నది. ఆ గడ్డికి పూలు పూసిన తర్వాత నూనె తీయడానికి పనికి రాదు. ఆ గడ్డిని పీకివేసి మరో పంట వేయడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినది. ఐటిడిఎ నిధులతో అటవీ శాఖ అడ్డతీగెల సమీపాన నెలకొల్పిన వెదురు మొక్కల పెంపకం కేంద్రం నుంచి ఒక్క మొక్కనైనా నాటడానికి తీసుకుపోలేదు.

గిరిజన ప్రాంతాలలోని తేలికరకం ఎర్రనేలలో తెల్ల బర్లీ పొగాకు పండిస్తారు. దానిలోని కోటిన్ ఉండదు. విదేశీ మారక ద్రవ్యార్జనకు తోడ్పడుతుంది. ఇంత వరకూ రైతుల ఎంపిక, వారికి రుణ, మార్కెటింగ్ సదుపాయాలు సమకూర్చడం ఐ.టి.సి. [ఇండియన్ టొబాకో కంపెనీ] మరికొన్ని ఇతర చిన్న కంపెనీల చేతుల్లో ఉంటూ వచ్చింది.

ప్రైవేట్ పొగాకు కంపెనీలు చేస్తున్న అక్రమాలను కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాయి.

ఇంత వరకూ ఈ విషయంలో "లాభాలు పొగాకు కంపెనీలవి, నష్టాలు గిరిజన రైతులవి" అనే పోకడ కొనసాగుతూ వచ్చింది. గత సంవత్సరం నక్సలైట్లు ఒత్తిడితెచ్చి కంపెనీల వారు కొనుగోలు ధర పెంచేట్టు చేశారు.

పొగాకు పండించడానికి రుణాలివ్వడాన్ని జి.సి.సి [గిరిజన సహకార సంస్థ] చేపట్టింది. నారుమళ్ళు పెంచడం, పైరురక్షణ, మార్కెటింగ్ ఇప్పటికీ ఆ కంపెనీల చేతుల్లోనే ఉన్నవి. ఈ సంవత్సరం కూడా పొగాకు కొనుగోలు ధర పెంచాలని నక్సలైట్లు డిమాండ్ చేయనున్నట్టు తెలిసింది. అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో శిక్షణ కార్యక్రమాలకు మార్కెటింగ్‌కై జి.సి.సి.పై ఐ.టి.డి.ఎ. ఆధారపడవలసి ఉన్నది. తాటినార తయారీలో గిరిజనులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఐ.టి.డి.ఎ. చేపట్టలేదు. గిరిజన సంక్షేమానికై కృషి చేస్తున్న ఈ సంస్థల మధ్య సమన్వయంలోపించింది. జి.సి.సి. ఇంత వరకు గిరిజనులకు బోనస్‌కానీ, నిత్యావసర వస్తువులకు రుణాలను కానీ పంపిణీ చేయలేదు. జి.సి.సి. ఉన్నతాధికారులు ఎంతో చొరవకల వారు. సంస్థ వాణిజ్యం ఎంతగానో పెరిగినా, కేంద్ర, డివిజన్ బ్రాంచ్ కార్యాలయాల సామర్థ్యం పెంపొందవలసి ఉన్నది. కార్యక్రమాలను రూపొందించడం, అమలుపరచడం సమన్వయ పూర్వకంగా జరగకపోతే మొత్తం యత్నం విఫలమౌతుంది.

అటవీశాఖ అధికారులు, పేపర్‌మిల్లు రైతు కూలీ సంఘం మధ్య కూలీరేట్లపై ఒప్పందం జరిగింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్1వ తేదీ నుంచి అటవీశాఖ కూలీ రేట్లను సవరిస్తుంది. అయితే రైతు కూలీ సంఘం వంటి ఒత్తిడి తెచ్చే గ్రూపులతో అక్టోబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంటుంది. కూలీ రేట్ల సవరణ తేదీ ఒప్పందం తేదీ మధ్యకాలంలో కూలీరేట్లలోని ఆ వ్యత్యాసం మొత్తాన్ని అధికారులు భుక్తం చేసుకొంటారు. అందుచేతనే కూలీరేట్ల పత్రికను పని ప్రదేశాలలో ప్రదర్శించకుండా వారు 'రహస్య' పత్రంగా ఉంచుతారు.

"శక్తి" అనే స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలుసుకొని ఈ విషయం ఆయన దృష్టికి తెచ్చారు. పని ప్రదేశాలలో కూలీ రేట్ల పట్టికను ప్రముఖంగా ప్రదర్శించవలసిందిగా అధికారులను ఆదేశించగలమని ఆయన హామీ ఇచ్చారు. ఆ తరువాత ఏమైనదో తెలియదు. 1984నుంచి అడవులలో పనులు, కలప పనులకు సంబంధించి కనీస కూలీ రేట్లను కార్మికశాఖ సవరించనే లేదు. గిరిజనులను వంచించే విషయంలో అటవీ, కార్మిక శాఖల మధ్య అవగాహన ఉన్నట్టు భావించవలసి వస్తున్నది. తత్ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస కూలీరేట్లు గిరిజనులకు దక్కడం లేదు.